సాక్షి పెద్దపల్లి

శనివారం । 11 । మే । 2024

జీజీహెచ్‌లో నర్సింగ్ డే



కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో శుక్రవారం ముందస్తు అంతర్జాతీయ నర్సింగ్ డే ఘనంగా నిర్వహించారు.

స్వతంత్రుల గండం

- బరిలో 42 మంది.. ఇండిపెండెంట్లు 26 మంది
- ప్రధాన పార్టీల్లో గుబులు .. ఓట్ల చీలకపై ఆందోళన
- గెలుపోటములు, మెజార్టీపై తీవ్ర ప్రభావం



సాక్షి, పెద్దపల్లి: లోక్‌సభ ఎన్నికల గడువు సమీపిస్తోంది. దీంతో అందరి దృష్టి స్వతంత్ర అభ్యర్థులపై పడింది. ప్రధాన పార్టీలకు స్వతంత్ర అభ్యర్థుల గండం పట్టుకుంది. పెద్దపల్లిలో ప్రధాన పార్టీల మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులే కాకుండా మరో 39మంది పోటీలో ఉన్నారు. వీరిలో చిన్నపార్టీల తరఫున 13మంది, స్వతంత్రులుగా 26మంది బరిలో ఉన్నారు. ఈసారి ఇండిపెండెట్లు ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపనున్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. నోటాతోపాటు 16మంది అభ్యర్థుల కంటే ఎక్కువ ఉంటే మరో ఈవీఎం అమర్చాల్సి ఉంటుంది. దీంతో ఈసారి పెద్దపల్లిలో మూడు ఈవీఎంలు ఉపయోగించనున్నారు. గెలిచే అవకాశం లేకపోయినా.. వీరికి పోలయ్యే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తాయోనన్న భయం ప్రధాన పార్టీల అభ్యర్థుల వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

వీరి ప్రభావం ఎంత?

- పెద్దపల్లి పార్లమెంట్‌కు 2019లో జరిగిన ఎన్నికల్లో 17 మంది అభ్యర్థులు పోటీ చేయగా, అందులో ఏడుగురు ఇండిపెండెంట్లు, మరో ఏడుగురు చిన్న పార్టీల అభ్యర్థులు ఉన్నారు. మిగతా వారు ప్రధాన పార్టీల అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
- అయితే, చిన్నపార్టీలు, స్వతంత్రుల డిపాజిట్లు గల్లంతయ్యాయి.
- కానీ వీరికి 72,658 ఓట్లు పోలై 9.41 శాతం నమోదు చేయడం గమనార్హం.
- రోడ్డురోలర్ గుర్తు ఏకంగా 18,219 ఓట్లు సాధించడం మరో విశేషం.
- అప్పుడు ద్విముఖ పోటీ ఉండగా, ఇప్పుడు త్రిముఖ పోటీతో స్వతంత్ర అభ్యర్థులకు పోలయ్యే ఓట్లపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

గుర్తులతోనూ ఇబ్బందే..

ఇండిపెండెంట్ అభ్యర్థులకు కేటాయించిన గుర్తులు, ప్రధాన పార్టీ అభ్యర్థులకు కేటాయించిన గుర్తులను పోలిఉన్న సందర్భాల్లో క్రాస్‌ఓటింగ్ జరిగే అవకాశం ఉంటుంది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు వారు ఏ ప్రాంతాల్లో, ఏ సామాజిక వర్గాల ఓట్లను కొల్లగొట్టనున్నారోనని అన్ని రాజకీయ పార్టీలు లెక్కలు కడుతున్నాయి.

నామినేషన్ వేశారు.. ప్రచారం మరిచారు

పార్లమెంట్ ఎన్నికల ప్రచార గడువు మరో రెండు రోజుల్లో ముగియనుంది. అయినా, చాలా మంది అభ్యర్థులు ప్రచారం ఇంకా ప్రారంభించనేలేదు. నామినేషన్ల ముందు నుంచే ప్రధాన పార్టీల అభ్యర్థులు మండలాల వారీగా ప్రచార సభలు, సమావేశాలతో దూసుకుపోతున్నారు. ప్రచార వాహనాలతో గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ స్వతంత్రులుగా, చిన్నపార్టీల అభ్యర్థులు ప్రచారంలో ఎక్కడా కానరావడంలేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులు పోటీచేసి ప్రధాన పార్టీల అభ్యర్థులకు దీటుగా ప్రచారం చేశారు. కొంతవరకు వివిధ పార్టీల ఓట్లు చీల్చడంలోనూ విజయం సాధించారు. స్వతంత్రుల్లో కొందరు ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు పోటీచేస్తున్నారు. అయితే ఎమ్మెల్యే ఎన్నికల్లో నియోజకవర్గ పరిధి చిన్న ఉండటం, ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండడంతో అభ్యర్థుల శక్తిమేరకు ప్రచారం చేశారు. కానీ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి విశాలంగాఉంది. ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. దీంతో ప్రచారానికయ్యే ఖర్చు భరించడం కష్టమనే భావనతోనే కొందరు అభ్యర్థులు ముందకు రావడం లేదని తెలుస్తోంది.

మోదీ క్రేజీతో బోణీ

- మూడు తరాల పాలనకు ఇదేమన్నా రాజరికమా?
- రిజర్వేషన్ల రద్దుపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం
- ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రత్యేక ప్రణాళిక ఉంది
- ఎంపీగా గెలిస్తే బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటా
- 'సాక్షి'తో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్



ప్రపంచ పటంలో మనదేశాన్ని నంబర్ వన్‌గా నిలబెట్టిన మోదీ క్రేజీ, అభివృద్ధితో పెద్దపల్లిలో బీజేపీ ఎంపీగా గెలవబోతున్నానని ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. టాప్ టెన్ శ్రీమంతుల జాబితాలో ఉన్న 'కాకా' ఫ్యామిలీ 40ఏళ్లుగా ఒక్క పరిశ్రమ కూడా ఎందుకు పెట్టలేదో ప్రజలుకు సమాధానం చెప్పాలన్నారు. పుట్టిన గడ్డను అభివృద్ధి చేయాలనే స్థానికుడికి ఉండే ప్రేమ, వలసవాదలకు ఉండదన్నారు. అందుకే స్థానికుడైన తనను ఆదరిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా అంటున్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్.. ఆయన మాటల్లోనే..

– సాక్షి, పెద్దపల్లి

ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుంది?

కేంద్రంలో 'మూడోసారి మోదీ– పెద్దపల్లిలో గోమాస బోణీ' నినాదంతో ప్రచారం చేస్తున్నాం. ఎక్కడకు వెళ్లినా ప్రజల నుంచి అనూహ్య స్పందన వస్తోంది. గల్లీలో ఎవరున్నా.. ఢిల్లీలో మోదీ ఉండాలని చెబుతున్నారు. మోదీ క్రేజీతో తొలిసారి పెద్దపల్లిలో బీజేపీ విజయం సాధించబోతోంది.

మీ విజయానికి దోహదం చేసే అంశాలు ఏమిటి?

బీజేపీ చేసిన అభివృద్ధి, అవినీతిరహిత పాలన, అయోధ్య రామమందిర నిర్మాణం, 370 ఆర్టికల్ రద్దు, మహిళా రిజర్వేషన్ బిల్లు, సంక్షేమ పథకాలు, మోదీ క్రేజీ మా విజయానికి ప్రధాన భూమిక పోషిస్తాయి. దీనికి తోడు ఒకేకుటుంబం మూడు తరాలుగా పాలించడానికి ఇదేమైనా రాజరిక వ్యవస్థనా? అని ప్రజలు ఆలోచిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఒక్క టికెట్ కేటాయించలేదు. ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగలు మద్దతు ఇస్తున్నారు.

వచ్చే పదేళ్లలో మీరు చేసే అభివృద్ధి ఏమిటి?

నేను స్థానికుడిని. సింగరేణి కార్మికుల సమస్యలు తెలుసు. ఆదాయపు పన్ను మినహాయింపు, సొంతింటి కల, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, జాతీయ రహదారుల నిర్మాణం, నవోదయ, కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, కోల్‌కారిడార్, సింగరేణి ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు కృషి చేస్తా. పెద్దపల్లిలో సూపర్‌ఫాస్ట్ రైళ్ల హాల్టింగ్, సమస్యలు పరిష్కరిస్తా. యువత అభ్యున్నతి, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తా. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల స్థాపనకు చొరవచూపుతా. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తా.

రిజర్వేషన్లపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఎలా తిప్పికొడుతున్నారు?

బీజేపీ రిజర్వేషన్లు తొలగిస్తుందని విషప్రచారం చేస్తున్నారు. 370 ఆర్టికల్ తొలగించి కాశ్మీర్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించింది బీజేపీయే. ఈబీసీలకు 10శాతం రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేసింది బీజేపీయే. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు దక్కాల్సిన 4శాతం రిజర్వేషన్లను మైనార్టీలకు కట్టబెట్టింది కాంగ్రెస్.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామంటున్నారు కదా?

ఓట్లు దండుకోవడానికి నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని తప్పుడు హామీ ఇస్తున్నారు. వారికి నిజంగా నేతకానీలపై ప్రేమ ఉంటే రూ.500కోట్లతో పోలింగ్‌కు ముందే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. నేతకానీ ఓట్లను చీల్చడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా.. నమ్మే పరిస్థితి లేదు. అందుకు ఉదహరణే పెద్దపల్లి సిట్టింగ్ ఎంపీ వెంకటేశ్‌నేత బీజేపీలో చేరి నా విజయం కోసం విస్తృతంగా ప్రచారం చేయడమే.

ఓటర్లకు మీరేం చెప్పాలనుకుంటున్నారు?

నేను ఈ గడ్డపై పుట్టిన. అభివృద్ధిని ఎలా పరుగులు పెట్టించాలనే అంశంపై ప్రణాళిక ఉంది. తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై ప్రజల భ్రమలు తొలగిపోయాయి. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ నియంతగా వ్యవహరించారు. బీజేపీ నినాదం 'సబ్ కా సాత్ –సబ్ కా వికాస్' అయితే.. 'నేను నా తర్వాత నా కొడుకు' అనేది కాకా ఫ్యామిలీ నినాదం. ప్రజలు ఆలోచించి కుటుంబ పాలనను తిరస్కరించాలి. నాకు ఓటు వేస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా.

న్యూస్‌రీల్

48గంటల ముందే ప్రచారం ఆపాలి

పెద్దపల్లిరూరల్: ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పోలింగ్‌కు 48 గంటల ముందే ఎన్నికల ప్రచారం ముగించి సైలెన్స్ పీరియడ్ పాటించాలని జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. ఫలితాలను ప్రభావితం చేసేలా మీడియాలో ప్రసారాలు చేయవద్దన్నారు. పోలింగ్‌కు 48గంటల ముందు ఎలాంటి ఎన్నికల ప్రచారం చేయవద్దని అభ్యర్థులకు సూచించారు. ప్రచారం కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈ ప్రాంతం విడివచి వెళ్లిపోవాలని ఆదేశించారు. ప్రచారానికి సంబంధించి బల్క్ మెసేజీలు పంపడాన్ని కూడా నిషేధించామని వివరించారు. సెలైన్స్ పీరియడ్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

వైద్యం కోసం రూ.15లక్షల సాయం



ఉద్యోగులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఆపదలో ఉన్న ఉద్యోగికి సహచర ఉద్యోగులు బాసటగా నిలిచి మానవతాదృక్పథం ప్రదర్శించడం ప్రశంసనీయమని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు బొంకూరి శంకర్, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు తూము రవీందర్ తదితరులు దాతల నుంచి సేకరించిన రూ.15,73,634 నగదును కలెక్టరేట్‌లో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సమక్షంలో రాజగోపాల్‌కు శుక్రవారం అందజేశారు. కమాన్‌పూర్ పీహెచ్‌సీ సీనియర్ అసిస్టెంట్ రాజగోపాల్ కుమారుడికి గుండె సంబంధిత చికిత్స బెంగళూరు ఆస్పత్రిలో జరుగుతోంది. దీంతో ఉద్యోగులు సహకారం అందించారు. డీఈవో మాధవి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.

చెరువు మట్టి తీసుకెళ్లండి



పూడిక తీస్తున్న కూలీలు

పెద్దపల్లిరూరల్: రైతులు తమ పంట పొలాలను సారవంతం చేసుకునేందుకు చెరువుల్లో పూడిక తీసిన మట్టిని వేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదిరెడ్డి సూచించారు. వేసవిలో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గినపుడు పూడికతీసి ఆ మట్టిని పొలాల్లో పోయడం ద్వారా నేల సారవంతమవుతుందన్నారు. పలు గ్రామాల్లో ఉపాధి కూలీలు పూడికతీత చేపట్టారని, సొంతంగా ట్రాక్టర్ ఏర్పాటు చేస్తే కూలీలు మట్టిని ట్రాలీలో పోస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలీసు బలగాల కవాతు



కవాతులో పోలీసు అధికారులు

గోదావరిఖని: పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు వీలుగా వచ్చిన పోలీసు బలగాలు శుక్రవారం నగరంలో కవాతు నిర్వహించాయి. గోదావరిఖని ఏసీపీ రమేశ్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. స్థానిక రాజేశ్ టాకీస్, అడ్డగుంటపల్లి, రమేశ్‌నగర్ వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ కమాండెంట్ పాల్గొన్నారు.

మావోయిస్ట్ నేత నర్సయ్యకు నివాళి

పాలకుర్తి(రామగుండం): ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్ట్ నేత చీమల నర్సయ్య సంస్మరణ సభ శుక్రవారం జయ్యారం గ్రామంలో నిర్వహించారు. అమరుల బంధుమిత్రుల సంఘం, వివిధ ప్రజాసంఘాల నాయకులు హాజరయ్యారు. నర్సయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఆయన సేవలు స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో అమరుల బంధుమిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు పద్మకుమారి, భవాని, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నక్క నారాయణరావు, సహాయ కార్యదర్శి మాదాన కుమారస్వామి, దళిత లిబరేషన్ ఫ్రంట్ నాయకుడు మార్వాడి సుదర్శన్, రైతు సంఘం నాయకులు ముడిమడుగుల మల్లన్న, పానుగంటి సత్తయ్య, పోరేటి వెంకన్న, ఎరుకల రాజయ్య, కొడిపుంజుల రాజన్న, ఈదునూరి నరేశ్, గాండ్ల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల జిల్లా ఉండాల్నా.. వద్దా?



సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఎమ్మెల్యే కేటీఆర్, వినోద్‌కుమార్

- గోదావరి నీళ్లు రావాలన్నా.. వినోద్‌కుమార్‌ను గెలిపించాలే..
- మన హక్కులు కాపాడుకోవాలంటే.. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలే..
- సిరిసిల్ల రోడ్ షోలో బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు

సిరిసిల్ల: 'దేవుని పేరుమీద ఉండాలని రాజన్నసిరిసిల్ల జిల్లాను చేసుకున్నాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి సిరిసిల్ల జిల్లాను తీసేస్తా అంటుండు.. జిల్లా ఉండాల్నా వద్దా..?' అని బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు ప్రశ్నించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి సిరిసిల్ల నేతన్నచౌక్‌లో రోడ్‌షోలో ప్రసంగించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఉండాలంటే.. వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. గోదావరి నీళ్ల నర్మాల ఎగువమానేరుకు, మధ్యమానేరుకు రావాలన్నా.. మన హక్కులు కాపాడుకోవాలంటే.. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలన్నారు. మొన్ననే ప్రధాని నరేంద్రమోదీ వేములవాడకు వచ్చిండు.. దేవస్థానాన్ని బాగుచేస్తానని, ఒక్క మాటనన్నా చెప్పిండా..? అని ప్రశ్నించారు. 'సిరిసిల్ల చేనేత కార్మికులకు రూ.371 కోట్లు బకాయిలు ఉన్నాయి.. ఈ ప్రభుత్వం కట్టమంటే కట్టకుండా నేతకార్మికులను పాపడాలు, నిరోధ్‌లు అమ్ముకోండంటే.. కోపం వచ్చి నేనోటి అంటే.. నా మీద 48 గంటల నిషేధం పెట్టారు..' అని కేసీఆర్ వివరించారు. తెలంగాణ రాక ముందు నేతన్నల ఆత్మహత్యలు చూసి చలించి రూ.50లక్షలను తమ పార్టీ పరంగా తెచ్చి ఆదుకున్న విషయాన్ని గుర్తు చేశారు. నేతన్నల బతుకులు మార్చేందుకు బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫాల ఆర్డర్లు ఇచ్చినం.. మరీ ఇప్పుడు అవన్నీ ఎటుపాయే'? అని కేసీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు ఎందుకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇవ్వదని అడిగారు. నేతకార్మికులు అంటే.. అంత అలుసా? అని ప్రశ్నించారు. పని లేక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే.. ఆర్డర్లు ఇవ్వకుండా.. బకాయిలు ఇవ్వకుండా కార్మికుల బతుకులతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చర్చించి ఓటు వేయాలే...

ఇప్పుడు కీలక సమయమని, ఇంకా మూడు రోజుల సమయం ఉందని.. ఇంటికెళ్లి మీరంతా చర్చించి ఓటు వేయాలే.. అని కేసీఆర్ కోరారు. మరమగ్గాలు(పవర్‌లూమ్స్) బంద్ అయిపోయి, కార్మికుల ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్ల కవులు, రచయితలు, మేధావులకు నిలయని, పెద్దింటి అశోక్‌కుమార్ లాంటి రచయితలు ఉన్నారని, అందరూ ఆలోచించి ఓటు వేయాలని కోరారు. రైతుభరోసా ఎటుపాయే.. ధాన్యం కొంటలేరు.. కాంగ్రెస్ పాలనలో ఎన్ని గోసలు పడుతున్నమో.. మీరే చూస్తున్నారన్నారు. తెలంగాణ కోసం రాజీనామా చేస్తే.. రెండు లక్షల మెజార్టీ ఇచ్చి ఉద్యమాన్ని నిలబెట్టారని, ఈ కీలక సమయంలో అండగా ఉండాలని కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారకరామారావు, ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- ఈవీఎంల తరలింపునకు పటిష్ట భద్రత కల్పించాలి
- రిటర్నింగ్ అధికారులతో రాష్ట్రఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు వీలుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్రఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. రాష్ట్రంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో ఆయన శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. పెద్దపల్లి లోక్‌సభ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ తదితరులు హాజరయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు పూర్తిచేశామని పెద్దపల్లి లోక్‌సభ రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. జిల్లాలోని 497 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 131 కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో మాక్‌పోలింగ్ నిర్వహణ, ప్రతీ రెండు గంటలకోసారి పోలింగ్ శాతం నివేదికలు అందేలా చూడాలని అన్నారు. రిసెప్షన్ నుంచి లెక్కింపు కేంద్రాలకు ఈవీఎంలు తరలించే సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పోలింగ్ ప్రశాంతంగా పూర్తి చేయడంతో పాటు ఈవీఎంలు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరేవరకు పటిష్ట భద్రత కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు హనుమానాయక్, గంగయ్య, డీపీవో ఆశాలత, డెప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్సులో రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్ అరుణశ్రీ

వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీల అమలు



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

- రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. జమేమసీదు వద్ద శుక్రవారం ఆయన ముస్లింలను కలుసుకుని ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను గెలిపించాలని కోరారు. మైనార్టీలకు ఓటు హక్కు లేకుండా చేసే ఆలోచనలో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్‌లను చిత్తుగా ఓడించాలని ఆయన కోరారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నృత్యం చేసిన ఠాకూర్

పరశురాముని జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ప్రత్యేక పూజల చేశాక డప్పువాయించి నృత్యం చేశారు. కార్యక్రమంలో నాయకుడు బండి రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తాపడిన ఘటనలో వ్యక్తి మృతి

ధర్మారం(ధర్మపురి): మండలం కేంద్రంలోని సాయిమణికంఠ హైస్కూల్ సమీపంలో గురువారం రాత్రి ఆటో బోల్తాపడిన ఘటనలో గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జంగిలి బక్కయ్య (62) చికిత్స పొందుతూ శుక్రవారం మరణించినట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. ధర్మారంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన రోడ్‌షో కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళ్తుండగ డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడపటంతోడాటో బోల్తాపడింది. ఈ ఘటనలో బక్కయ్య తీవ్రంగా గాయపడ్డాడు. కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేస్తుండగా శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య నరసక్క ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్ పోతు లచ్చయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఉరిపోసుకుని వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: కనగర్తి గ్రామానికి చెందిన పారుపల్లి కుమార్(41) కొంతకాలంగా జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన కుమార్ శుక్రవారం ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సై రవీందర్‌రావు తెలిపారు. మృతుడి భార్య రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మృతుడికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంథని: పట్టణ శివారులోని అయ్యగారి చెరువు సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురి పట్టుకోగా, మరో ముగ్గురు పారిపోయారని ఎస్సై వెంకటకృష్ణ శుక్రవారం తెలిపారు. పేకాట రాయుళ్ల నుంచి రూ.12,710 నగదు, మూడు మొబైళ్లు, మూడు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

'ఉద్యమకారులపై కేసులు కొత్తేమీకాదు'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చందర్

గోదావరిఖనిటౌన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులను అణచివేసే విధంగా కేసులు నమోదు చేసి, నిర్బంధిస్తూ భయాందోళనలకు గురిచేస్తోందని, ఉద్యమకారులకు ఇదేమీకొత్తకాదని మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. ఇటీవల రైతుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ఎన్టీపీసీలో రైతుల పక్షాన ఉద్యమాలు చేస్తే అక్రమంగా కేసులు పెట్టారని ఆయన అన్నారు. ఈ కేసులో శుక్రవారం గోదావరిఖని కోర్టుకు మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చందర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారులు కోర్టు కేసులపై భయపడబోరన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేంతవరకూ ఉద్యమిస్తామని ఆయన అన్నారు.

5 కంపెనీలు.. 443మంది పోలీసులు

- మావోయిస్టు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా
- సరిహద్దు రాష్ట్రాల్లో కూంబింగ
- నేటి నుంచి 144 సెక్షన్ అమలు
- పార్లమెంట్ ఎన్నికలకు పటిష్ట భద్రత



డ్రోన్ ద్వారా సరిహద్దు అడవుల్లో నిఘా(ఫైల్)



పోలీసు బలగాల కవాతులో రామగుండం సీపీ శ్రీనివాస్, పెద్దపల్లి డీసీపీ చేతన తదితరులు

గోదావరిఖని: ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈవీఎంల తరలింపు మొదలు.. పోలింగ్ పూర్తయ్యేంత వరకూ పోలీసు బగాలు డేగకళ్లతో నిఘా ఉంచేలా కార్యాచరణ రూపొందించారు. ఇందుకోసం ఇప్పటికే పారామిలటరీ బలగాలు చేరుకున్నాయి. మరో 48గంటల్లో పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు.

మావోయిస్టుల కట్టడికి..

- సరిహద్దుల్లోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ పోలీసు అధికారులతో ఇప్పటికే సమన్వయం చేసుకుంటూ మావోయిస్టు కదలికలపై సమాచారం సేకరిస్తున్నారు.
- రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో తనిఖీల కోసం ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు.
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, రాష్ట్ర సరిహద్దులు, మారుమూల గ్రామాలు, అటవీప్రాంతాల్లో ఇప్పటికే కూంబింగ్ కొనసాగుతోంది.
- పాత నేరస్తులు, రౌడీషీటర్లు, గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిపై ప్రత్యేక దృష్టి సారించారు.
- నగదు, మద్యం అక్రమ ప్రవాహాన్ని అడ్డుకునేందుకు నిరంతరం తనిఖీలు చేస్తున్నారు.

ప్రత్యేక పోలీసు బలగాల రాక..

రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు ఇప్పటికే ప్రత్యేక పోలీసు బలగాలు చేరుకున్నాయి. రెండు కంపెనీల సీఆర్‌పీఎఫ్, మూడు కంపెనీల బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్) బలగాలకు చెందిన 443మంది సిబ్బంది ఇందులో ఉన్నారు. వీరితో పాటు స్థానిక పోలీసులు కూడా భద్రతలో పాలు పంచుకుంటారు.

రామగుండం కమిషనరేట్ సమాచారం	
మొత్తం పోలింగ్ కేంద్రాలు	1,568
సమస్యాత్మక	179
సాధారణ	1,372
పోలింగ్ లొకేషన్లు	905
సమస్యాత్మకమైనవి	76
సాధారణమైనవి	813
మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలు	17
మావోయిస్టు ప్రభావిత పోలింగ్ లొకేషన్లు	16
అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు	1
అంతర్‌జిల్లా చెక్‌పోస్టులు	11
ఎస్ఎస్‌టీ టీంలు	16
ఎఫ్ఎస్‌టీ టీంలు	17

144సెక్షన్ అమలు..

- పోలింగ్ జరిగే ఈనెల13న వరకు కేంద్రాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా 144సెక్షన్ అమలు చేస్తున్నారు.
- పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని ధర్మపురి, రామగుండం, పెద్దపల్లిలో ఈనెల 11 సాయంత్రం 6గంటల నుంచి ఈనెల 13వ తేదీ సాయంత్రం 6గంటల వరకు 144 సెక్షన్ అమలు చేస్తారు.
- మంథని, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల నియోజకవర్గాల్లో శనివారం సాయంత్రం 4గంటల నుంచి ఈనెల 13 సాయంత్రం 4గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుంది.
- రాజకీయ పార్టీల జెండాలు, గుర్తులు, ప్లకార్డులు ధరించవద్దు, ప్రదర్శించ వద్దు
- మైకులు, లౌడ్ స్పీకర్లు వాడవద్దు. రాజకీయ పార్టీల పాటలు, ఉపన్యాసాలు ఇవ్వకూడదు.
- విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించవద్దు
- ధర్నాలు, రాస్తారోకోలు, ఊరేగింపులు, టపాసుల కాల్చివేతను నేరాలుగా పరిగణిస్తారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు	
నగదు(రూ.లలో)	1,67,60,492
బంగారం(కేజీల్లో)	1.042
వెండి(కేజీల్లో)	6.73
వీటి మొత్తం విలువ(రూ.లలో)	81,02,691
గంజాయి(కేజీల్లో)	11.211
దాని విలువ(రూ.లలో)	4,17,775
మద్యం, పటిక విలువ(రూ.లక్షల్లో)	1.46లక్షల
మద్యం, పటిక స్వాధీనం నమోదు చేసిన కేసులు	635
బైండోవర్ చేసినవారు	1,373
డిపాజిట్ చేసిన ఆయుధాలు	51

నిఘా పటిష్టం



ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రశాంత వాతావరణం కల్పిస్తాం. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశాం. ప్రధానంగా మావోయిస్టుల కట్టడికి సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్ ఆపరేషన్ చేపట్టాం. పొరుగు రాష్ట్రాల పోలీసు అధికారులతో సమాచారం ఇచ్చిపుచ్చుకుంటున్నాం.
– శ్రీనివాస్, సీపీ, రామగుండం

పెద్దపల్లిలో బైపాస్ రోడ్డు నిర్మిస్తాం



మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

- రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

పెద్దపల్లిరూరల్: 'అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీహామీని నెరవేరుస్తాం.. పెద్దపల్లిలో బైపా స్ రోడ్డు నిర్మిస్తాం.. పత్తిపాక రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందిస్తాం.. ఆ తర్వాతే ఓట్లడుగుతాం' అని రాష్ట్ర ఐటీమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. పట్టణంలోని జెండాకూడలిలో శుక్రవారం రాత్రి జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే విజయరమణారావు, సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్‌తో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు పెద్దపల్లికి బైపాస్ రోడ్డు కావాలంటూ నిత్యం సిబంధిత శాఖ మంత్రితోపాటు తనపై ఒత్తిడి తెస్తుంటారని శ్రీధర్‌బాబు అన్నారు. వ్యవసాయ రంగానికి అవసరమైన సాగు నీరందించే పత్తిపాక రిజర్వాయర్ నిర్మిస్తామని, బైపాస్ రోడ్డు పనులను పక్కాగా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ పనులు చేపట్టకపోతే వచ్చే ఎన్నికల్లో ఓట్లడగబోమని స్పష్టం చేశారు. పెద్దపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ విజయం ఖరారైందన్నారు. విపక్ష పార్టీల నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మడం లేదని అన్నారు. పెద్దపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే కాకుండా జిల్లా కేంద్రంగా అవసరమైన హంగులను కల్పిస్తామని ఎమ్మెల్యేలు విజయరమణారావు, వివేక్ అన్నారు. సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ మాట్లాడుతూ, యువనేత వంశీకృష్ణను ఎంపీగా గెలిపిస్తే ఈ ప్రాంత యువతకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు. నియోజకవర్గంలోని పలు మండలాలు, గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపుతోనే అభివృద్ధి

గోదావరిఖని: కాంగ్రెస్ గెలుపుతోనే పారిశ్రామిక ప్రాంత అభివృద్ధి సాధ్యమని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. అబద్ధాలతో కాలం వెళ్లదీస్తున్న బీజేపీ, బీఆర్ఎస్‌లను ప్రజలు నమ్మబోరన్నారు. ఎంపీగా యువ నాయకుడు వంశీకృష్ణను గెలిపిస్తే పార్లమెంట్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. సినీ నిర్మాత బండ్ల గణేశ్‌తోపాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రశ్నించే గొంతుకనవుతా

- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న ఈశ్వర్, పుట్ట మధు తదితరులు

గోదావరిఖని: కార్మికుల కష్టాలు తెలిసిన సింగరేణి బిడ్డగా తనను గెలిపిస్తే చట్టసభల్లో సమస్యలపై ప్రశ్నించే గొంతుకనవుతానని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 కార్మికులను కలుసుకుని కారుగుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. మంత్రిగా అనేక హక్కులు సాధించి పెట్టానని అన్నారు. కోలిండియా కన్నా అదనపు హక్కులు సాధించడంతోపాటు రాదనుకున్న వారసత్వ ఉద్యోగాలను మెడికల్ ఇన్వాల్యుయేషన్ ద్వారా పునరుద్ధరించుకున్నామన్నారు. నూతన నియామకాలుతో 18వేల మంది యువతకు ఉద్యోగాలు లభించాయన్నారు. సింగరేణి అభివృద్ధి, మనుగడ కాపాడుకోవడానికి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని, రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ దేశంలో ఉన్న బీజేపీ రెండు పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. నాయకులు మిర్యాల రాజిరెడ్డి, మాదాసు రామమూర్తి, నూనె కొమురయ్య, ఐలి శ్రీనివాస్, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, హమీద్, అనిల్ రెడ్డి, రాకేశ్, నరేందర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అధికారం కోసం అబద్ధపు ప్రచారం

మంథని: కుర్చీ కోసం కాంగ్రెస్ అబద్ధపు హామీలు ఇచ్చిందని, వాటినే అమలు చేయకుండా మళ్లీ ముందుకు వస్తోందని, ప్రజలు వాస్తవాలు గుర్తించి బీఆర్ఎస్ పార్టీని ఆదరించాలని ఆ పార్టీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ కోరారు. స్థానిక గాంధీచౌక్‌లో జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుతో కలిసి శుక్రవారం ఆయన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. రైతులు, అన్ని వర్గాల కష్టాలు రాకుండా కేసీఆర్ చూశారని తెలిపారు. పదేళ్లు గొప్పగా పరిపాలన చేసినా.. ప్రజలు మరింత మార్పు కోరుకున్నారని, కానీ మార్పు అంటే గోసతప్ప మేలు జరగలేదని ఈశ్వర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కుట్ర పూరితంగా చేసిన విషప్రచారంతోనే నేడు ప్రజలు నష్టపోయారని పేర్కొన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతునై కాంగ్రెస్ మెడలు వంచి సంక్షేమ పథకాలు అమలు చేసేలా చూస్తానని, తనను ఆశీర్వదించాలని ఈశ్వర్ కోరారు. ప్రజలకు మేలు చేయాల్సినోళ్లు కీడు చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మంథని ప్రాంతంలో బీఆర్ఎస్ ఉనికి లేకుండా చేయాలని కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొప్పుల ఈశ్వర్‌ను గెలిపిస్తే ప్రజల పక్షాన పోరాటం చేస్తారని అన్నారు.

కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దు

రామగిరి(మంథని): ఆచరణకు అమలు కాని హామీలు ఇస్తూ ప్రజలను మభ్య పెట్టిన కాంగ్రెస్ మాటలు నమ్మితే భవిష్యత్ ఆగమవుతుందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. బేగంపేటలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్, నాయకులు మ్యాదరబోయిన కుమార్ యాదవ్, కుమార్‌స్వామి, శంకర్‌గౌడ్, కిరణ్ ఉన్నారు.

'ఆస్తుల రక్షణ కోసమే కాకా కుటుంబం పోటీ'

ధర్మారం(ధర్మపురి): ప్రజాసేవ పేరుతో మాజీ ఎంపీ వెంకటస్వామి(కాకా) కుటుంబం ఎన్నికల్లో పోటీ చేస్తోందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ఎంపీగా గెలుపొందిన తర్వాత ప్రజలను గాలికి వదిలి తన సొంత పరిశ్రమలను కాపాడుకునేందుకు పదవిని తాకట్టు పెడతారని ధ్వజమెత్తారు. జెడ్పీ చైర్మన్ పుట్ట మధు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, జెడ్పీటీసీ పుస్కూరి పద్మజ, సహకార సంఘాల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాంరెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో ఫ్రెషర్స్ సంబురం





మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వేదికపై మెడికోలు, ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు

- హాజరైన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ సింగరేణి మెడికల్ కాలేజీ(సిమ్స్)లో శుక్రవారం రాత్రి ఆవిర్భావ్–24 పేరిట నిర్వహించిన ఫ్రెషర్స్ డే ఆకట్టుకుంది. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులను ఉత్తేజ పరిచేలా కలెక్టర్, సీపీ చేసిన ప్రసంగం ఆకట్టుకుంది. ప్రతీ మెడికో ప్రజలకు ప్రాణం పోసే డాక్టర్ మాత్రమే కావాలని, క్షణికావేశంలో ర్యాగింగ్‌ల పేరిట కేసుల పాలు కావద్దని, తప్పు చేసి తల్లిదండ్రులకు చెడ్డపేరు తీసుకురావద్దని సూచించారు. ఉచితంగా వచ్చిన గొప్ప మెడికల్ సీటును అదృష్టంగా భావించి ఉన్నతంగా ఎదగాలన్నారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందుసింగ్, వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌తోపాటు ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, మెడికోలు పాల్గొన్నారు. వేదికపై మెడికోలతోపాటు ప్రిన్సిపాల్, ప్రొఫెసర్లు సైతం స్టెప్పులేసి అదరగొట్టారు.

రాజన్న సేవలో ప్రముఖులు



వేములవాడ: రాజన్నను ఎస్బీఐ డీజీఎం వివేక్ జైస్వాల్, సినీ దర్శకుడు ఎల్దండి వేణులు శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఆలయ పర్యవేక్షకులు తిరుపతిరావు, ప్రొటోకాల్ పర్యవేక్షకులు శ్రీరాములు, ఎస్బీఐ ఆర్ఎం వెంకటేశ్ పాల్గొన్నారు.

వారసత్వ రాజకీయాలతో ప్రమాదం



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్ తదితరులు

పెద్దపల్లిరూరల్: వారసత్వ రాజకీయాలతో దేశ సమగ్రతకు ప్రమాదం పొంచి ఉందని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వారసత్వ రాజకీయాలను పెంచి పోషిస్తున్నాయని విమర్శించారు. పెద్దపల్లి పార్లమెంట్ స్థానానికి సైతం కాంగ్రెస్ పార్టీ ఒకేకుటుంబానికి చెందిన వారికే అవకాశం కల్పించడం ఇందుకు నిదర్శనమన్నారు. ఎన్నికల్లో వివేక్ కుటుంబానికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు చిలారపు పర్వతాలు, దాడి సంతోష్, కావేటి రాజగోపాల్, మేకల శ్రీనివాస్, సంపత్ రావు, ఎర్రోల్ల శ్రీకాంత్, ఈదునూరి శంకర్, కుక్క వంశీ, సంపత్, సతీశ్, శ్రీనివాస్, రాజేందర్, సోడాబాబు, తిరుపతి, వినయ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



చింతల రాజు(ఫైల్)



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని మార్కండేయ కాలనీ చెందిన చింతల రాజు(19) వ్యవసాయ బావిలో శుక్రవారం శవమై తేలాడు. ఎస్సై శ్రావణ్ కుమార్, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మార్కండేయకాలనీ చెందిన చింతల శ్రీనివాస్–కనకమ్మ దంపతుల పెద్ద కొడుకు రాజు ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. గురువారం ఇంటినుంచి బయటకు వెళ్లి రాత్రి వరకూ రాలేదు. స్నేహితులను ఆరా తీసినా ఫలితం లేదు. శుక్రవారం ఉదయం గొల్లపల్లి శివారులోని వ్యవసాయ బావి వద్ద ద్విచక్ర వాహనం కనిపించింది. అనుమానంతో బావిలో చూడగా రాజు శవం కనిపించింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏ పాపం ఎరుగని తన కొడుకు అర్ధంతరంగా విగత జీవిగా మారాడని కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. కాగా, రాజుది హత్యా? ఆత్మహత్యనా? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

పార్లమెంట్ ఓటర్ల సంఖ్య 15లక్షలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఓటర్ల సంఖ్య 15,96,430గా తేలింది. ఈ విషయాన్ని అధికార యంత్రాంగం నిర్ధారించింది. ఇందులో పురుషులు 7,87,705 మంది కాగా మహిళా ఓటర్లు 8,08,622మంది, 103మంది ఇతరులు ఉన్నారని తేల్చారు. గత లోకసభ ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 14,78,062మంది ఓటర్లుండగా ఈసారి 1,18,368మంది ఓటర్లు పెరిగారు.

మంచిర్యాలలో అధికం..

- పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.
- జిల్లాలో నియోజకవర్గ కేంద్రమైన పెద్దపల్లితో పాటు రామగుండం, మంథని ఉండగా.. మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి, చెన్నూరు, మంచిర్యాల నియోజకవర్గాలు, జగిత్యాల జిల్లాలో ధర్మపురి సెగ్మెంట్ పరిధిలోని ధర్మారం మండలం ఉంది.
- మంచిర్యాల సెగ్మెంట్‌లో అత్యధికంగా 2,78,738 మంది ఓటర్లుండగా బెల్లంపల్లిలో అత్యల్పంగా 1,76,514మంది ఓటర్లున్నారు. పెద్దపల్లిలో 2,57,192మంది ఓటర్లు నమోదయ్యారు.

ఓటర్ల వివరాలు(అసెంబ్లీల వారీగా)			
నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు
పెద్దపల్లి	2,57,192	1,26,719	1,30,466
మంథని	2,39,699	1,17,352	1,22,329
రామగుండం	2,19,723	1,09,826	1,09,870
ధర్మపురి	2,30,786	1,12,442	1,18,338
మంచిర్యాల	2,78,738	1,38,064	1,40,648
బెల్లంపల్లి	1,76,514	87,283	89,219
చెన్నూరు	1,93,778	96,019	97,752

థర్డ్ జెండర్ ఓటర్ల వివరాలు..

పెద్దపల్లి లోకసభ నియోజకవర్గ పరిధిలో థర్డ్‌జెండర్ ఓటర్లు 103 మంది ఉన్నారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలో ఏడుగురు ఓటర్లుండగా, బెల్లంపల్లిలో 12మంది, మంచిర్యాలలో 26మంది, ధర్మపురిలో ఆరుగురు, రామగుండంలో 27మంది, మంథనిలో 18మంది, పెద్దపల్లిలో ఏడుగురు ఉన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి అద్దెవాహనాల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. శుక్రవారం జీడీకే–5 ఓసీపీ అధికారి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కన్వేయన్స్ డ్రైవర్లకు కనీసవేతనాల అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పీఎఫ్ సౌకర్యం అమలు చేయాలన్నారు. సింగరేణి ఉన్నతాధికారులు తమ అవసరాల కోసం కార్లు, బొలేరో వాహనాలను అద్దెకు తీసుకుంటూ వాటిపై పనిచేస్తున్న డ్రైవర్లకు చాలీచాలని వేతనాలు ఇస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం స్కిల్డ్ కాంట్రాక్టు కార్మికుడికి రోజూ వేతన రూ.734(టీఏ, డీఏ అదనం)గా ఇవ్వాలన్నారు. అన్ని అలవెన్సులు కలుపుకొని నెలకు రూ.34,200 వేతనం చెల్లించాల్సి ఉండగా, వాహనాల నిర్వాహకులు రూ.15వేల నుంచి రూ.19 వేల వరకు చెల్లిస్తున్నారని ఆవేదన చెందారు. వాస్తవానికి రూ.34,200బ్యాంకులో డ్రైవర్ పేరిట జమచేసిన తర్వాతే సింగరేణి యాజమాన్యం బిల్లు మంజూరు చేస్తోందని తెలిపారు. అయితే బ్యాంకులో డ్రైవర్ పేరిట సదరు మొత్తాన్ని జమచేసి బిల్లు చేతికందిన తర్వాత మిగతా డబ్బులు యజమానులు తీసుకుంటున్నారని ఆరోపించారు. అలాగే పీఎఫ్ అమలు చేయాల్సి ఉన్నా వాహన యజమానులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. సకాలంలో సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు వెనకాడబోమని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ఎంఏగౌస్, శనిగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

- ప్రభుత్వడిగ్రీ కాలేజీలో దోస్త్ హెల్ప్‌లైన్ సెంటర్
- ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య, అధ్యాపకులు

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులైన విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిన డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తారని అన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే విద్యార్థులకు సాయంగా ఉండేందుకు వీలుగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని, అన్ని వసతులతో ఉచితంగా విద్య అందించే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రవేశం పొందాలని ఆయన కోరారు. ప్రిన్సిపాల్‌తోపాటు కో ఆర్డినేటర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.